www.hamsakalam.com

PRGI TGTEL/26/A3129

# హంస కలం వార్త

సంచలన తెలుగు దినపత్రిక

HAMSAKALAM VARTHA

ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి




మేడ్చల్ మల్కాజిగిరి | సెప్టెంబర్ 1 మంగళవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 103 | పేజీలు : 8 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి

MEDCHAL ,MALKAJGIRI | TUESDAY AUGUST 1 2026 | VOL:1 | ISSUE: 103 | PAGES:8 | Rs. 4:00 | EDITOR:VADLA. Madhusudan chary




**హైదరాబాద్, ఆగస్టు 31:**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలోని గత ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పిస్తూ.. తనకు, కేసీఆర్‌కు పోలికే లేదని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కుటుంబ సభ్యులు, బంధువులకు పదవులు కట్టబెట్టారని ఆరోపించారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యం కల్పించామని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏం జరిగింది.. తమ ప్రభుత్వం రెండున్నరేళ్లలో ఏం చేసిందనే అంశంపై అసెంబ్లీలో చర్చకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. ముసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ముసారాంబాగ్ బ్రిడ్జి పూర్తి హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణ జరగాల్సి ఉందని సీఎం అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ముసారాంబాగ్ వంతెనను ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలోనే

(మిగతా 2వ పేజీలో..)

## పౌరసేవల్లో డేటా అనలటిక్స్.. పాలనలో కొత్త శకానికి చంద్రబాబు శ్రీకారం

**రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష**

**ప్రజల అభిప్రాయాలు, డేటా ఆధారంగా పౌరసేవలు మెరుగుపరచాలని సీఎం ఆదేశం**

**పారిశుధ్యంపై రాజీ లేదని, సంక్షేమ హాస్టళ్లలో నెలకోసారి పేరెంట్స్ మీటింగ్ పెట్టాలని సూచన**

**నిరుపయోగంగా ఉన్న 5.70 లక్షల ఎకరాల భూమిని సద్వినియోగం చేసుకోవాలని ఆదేశాలు**

ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలు, డేటా అనలటిక్స్‌ను విశ్లేషించడం ద్వారా ప్రభుత్వ శాఖలు అందించే పౌరసేవలను మరింత మెరుగుపరచాలని, అవసరమైన మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో 'రియల్ టైమ్ గవర్నెన్స్' (ఆర్టీజీ)పై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం, అల్లూరి విమానాశ్రయం వంటి కార్యక్రమాలకు

(మిగతా 2వ పేజీలో..)



## మోదీ వ్యక్తిగత శ్రద్ధ వల్లే బంధం బలోపేతం: పుతిన్



**మోదీ వ్యక్తిగత శ్రద్ధతో భారత్-రష్యా బంధం బలపడుతోందన్న పుతిన్**

**ఇరుదేశాల మధ్య విశేష వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందని వెల్లడి**

**ఈ ఏడాది మొదటి 6 నెలల్లో 2.6 శాతం పెరిగిన వాణిజ్య టర్నోవర్**

**రష్యాలో దాదాపు 40 వేలకు చేరిన భారతీయ విద్యార్థుల సంఖ్య**

భారత్-రష్యాల మధ్య 'విశేష వ్యూహాత్మక భాగస్వామ్యం' నిరంతరం బలపడుతోందని, ఇందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కనబరుస్తున్న వ్యక్తిగత చొరవ,

(మిగతా 2వ పేజీలో..)

## విజయ్ ప్రధాని అభ్యర్థిత్వం రగడ.. కాంగ్రెస్, డీఎంకే నేతల ఫైర్

**2029లో విజయ్ ప్రధాని అభ్యర్థి అంటూ టీవీకే ప్రచారం**

**దీనిపై డీఎంకేతో పాటు మిత్రపక్షం కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం**

**మా పీఎం అభ్యర్థి రాహుల్ గాంధీనేనని స్పష్టం చేసిన కాంగ్రెస్**

తమిళనాడులో అధికార టీవీకే (తమిళగ వెట్రి కళగం) పార్టీ, ముఖ్యమంత్రి విజయ్‌ను 2029 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రస్తావిస్తుండడం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనిపై డీఎంకేతో పాటు మిత్రపక్షమైన కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా

(మిగతా 2వ పేజీలో..)



## హరీశ్‌రావునైనా క్షమిస్తానేమో కానీ.. ప్రశాంత్‌రెడ్డిని క్షమించను: కవిత

**బీఆర్ఎస్, కాంగ్రెస్ మిలాఖత్ అయ్యాయని ఆరోపణ**

**ప్రశాంత్‌రెడ్డి తనను తండ్రికి దూరం చేశారని ఆవేదన**

**పుట్టింటి వాళ్లే కుట్ర పన్నారంటూ సభలో భావోద్వేగం**

**లక్ష కోట్ల కాళేశ్వరంతో నిజామాబాద్‌కు నీళ్లు ఇవ్వలేదని విమర్శ**

**వెయ్యి రోజులైనా హామీలు నెరవేర్చలేదని కాంగ్రెస్‌పై విమర్శలు**

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అవినీతి కారణంగానే ఆ రెండు పార్టీలు మిలాఖత్ అయ్యాయని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ మౌనంగా ఉందని ఆరోపించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ఆమె ప్రసంగించారు.బంగారు తెలంగాణ పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. పదేళ్లలో రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుందని కవిత విమర్శించారు.

(మిగతా 2వ పేజీలో..)



## హరీశ్‌రావునైనా క్షమిస్తానేమో కానీ.. ప్రశాంత్‌రెడ్డిని క్షమించను: కవిత

(మొదటి పేజీ తరువాయి)

ఆ పార్టీ హయాంలో నాలుగు ఇళ్లు మాత్రమే బంగారమయ్యాయని ఎద్దేవా చేశారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నిజామాబాద్‌లో ఒక్క ఎకరానికి కూడా నీళ్లు అందించలేకపోయారని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా వ్యక్తిగత విషయాలు ప్రస్తావిస్తూ కవిత భావోద్వేగానికి గురయ్యారు. ప్రశాంత్‌రెడ్డి తనను తండ్రి నుంచి దూరం చేశారని, ఆయనకు తన ఉసురు తగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. హరీశ్‌రావు, సంతోష్‌రావును క్షమించినా ప్రశాంత్ రెడ్డిని మాత్రం జీవితంలో క్షమించనని స్పష్టం చేశారు. ఆడబిడ్డ కష్టాల్లో ఉంటే పుట్టింటి వాళ్లే కుట్ర చేసి తరిమేశారంటూ కన్నీటిపర్యంతమయ్యారు. తాను ఏ తప్పు చేయకపోయినా నాలుగేళ్లుగా ఈడీ, సీబీఐలతో వేధించి తీహార్ జైలులో పెట్టారని కవిత అన్నారు. తాను నిర్దోషినని సుప్రీంకోర్టే చెప్పిందని, దేశ చరిత్రలోనే తొలిసారిగా ఒక సీబీఐ అధికారిపైనే విచారణకు ఆదేశించిందని గుర్తుచేశారు. ప్రజల జీవితాల్లో మార్పు కోసమే పంతం పట్టి పార్టీ పెట్టానని, పదవుల కోసం కాదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, ప్రతిపక్షంగా బీఆర్ఎస్ నిద్రపోతోందని విమర్శించారు.

## మోదీ వ్యక్తిగత శ్రద్ధ వల్లే బంధం బలోపేతం: పుతిన్

(మొదటి పేజీ తరువాయి)

ఇరు నేతల మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలే కారణమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. బిష్కెక్ వేదికగా జరుగుతున్న 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని మోదీతో నిర్వహించిన ద్వైపాక్షిక భేటీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉభయ దేశాల మధ్య సంబంధాల పురోగతి పట్ల పుతిన్ సంతృప్తి వ్యక్తం చేశారు. తమ మధ్య కేవలం వాణిజ్య పరమైన సంబంధాలే కాకుండా, దృఢమైన వ్యక్తిగత స్నేహబంధం ఉందని ఆయన స్పష్టం చేశారు. గ్లోబల్ సౌత్, తూర్పు దేశాల మధ్య సమన్వయాన్ని పెంపొందించే ఎస్‌సీఓ సదస్సుకు ముందుగా మోదీతో భేటీ కావడం సంతోషకరమన్నారు. ఇటీవల భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాస్కో పర్యటన సందర్భంగా ప్రస్తావించిన అంశాలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక సహకారం ఆశాజనకంగా ఉందని పుతిన్ వివరించారు. గతేడాది స్వల్ప తగ్గుదల కనిపించినప్పటికీ, ఈ ఏడాది ప్రథమార్థంలో వాణిజ్య టర్నోవర్ 2.6 శాతం వృద్ధిని నమోదు చేసిందని తెలిపారు. విద్యా రంగంలోనూ ద్వైపాక్షిక సహకారం అద్భుతంగా ఉందని, గత దశాబ్ద కాలంలో రష్యాలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ఏడు రెట్లు పెరగడం గమనార్హమన్నారు. ప్రస్తుతం ఈ సంఖ్య సుమారు 40 వేలకు చేరుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సెప్టెంబర్‌లో న్యూఢిల్లీ వేదికగా నిర్వహించనున్న బ్రిక్స్ సదస్సు కోసం రష్యా సిద్ధమవుతోందని పుతిన్ వెల్లడించారు. అలాగే, 2027 నాటికి భారత్-రష్యా దౌత్య సంబంధాలు 80 ఏళ్లు పూర్తి చేసుకోనున్నాయనే విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

## విజయ్ ప్రధాని అభ్యర్థిత్వం రగడ.. కాంగ్రెస్, డీఎంకే నేతల ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

స్పందిస్తూ, వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ఒకవేళ ఇదే ప్రచారం కొనసాగితే మంత్రివర్గం నుంచి వైదొలిగేందుకైనా వెనుకాడబోమని కాంగ్రెస్ హెచ్చరించడంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఇటీవల తిరుప్పూర్‌లో నిర్వహించిన ఒక సమావేశంలో టీవీకే సీనియర్ నేత, రెవెన్యూ శాఖ మంత్రి కే.ఏ. సెంగొట్టయన్ మాట్లాడుతూ, విజయ్ కేవలం తమిళనాడుకే పరిమితం కాదని, దేశాన్ని సమర్థవంతంగా నడిపించగల సత్తా ఉన్న నాయకుడని కొనియాడారు. ఆయన స్థాయి ఎంజీఆర్, జయలలితలను మించి ఉంటుందని ప్రశంసించారు. అంతేకాకుండా, టీవీకే అంతర్గతంగా నిర్వహించిన ఒక సర్వే ప్రకారం ప్రధాని రేసులో నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ తర్వాత విజయ్ మూడో స్థానంలో ఉన్నారని ఆ పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేస్తున్నాయి. ఈ పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి తరఫున రాహుల్ గాంధీయే ప్రధానమంత్రి అభ్యర్థి అని ఆ పార్టీ సీనియర్ నేత మాణికం ఠాగూర్ స్పష్టం చేశారు. ఈ నిర్ణయానికి టీవీకే మద్దతు తెలపని పక్షంలో తమిళనాడు మంత్రివర్గం నుంచి కాంగ్రెస్ వైదొలిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. మరోవైపు, డీఎంకే నేత భారతి ఈ వ్యాఖ్యలను ఎద్దేవా చేస్తూ, "ఊహలకు హద్దులుండవు, రేపు విజయ్ ఏకంగా ఐక్యరాజ్యసమితి చీఫ్ అవుతారని కూడా అంటారేమో" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మరో మిత్రపక్షమైన ఎండీఎంకే సైతం ఈ వాదనను వ్యతిరేకించింది. ఇండియా కూటమికి రాహుల్ గాంధీ మాత్రమే ప్రధానమంత్రి అభ్యర్థి అని, టీవీకే నేతలు ఇటువంటి ప్రచారాలను కట్టిపెట్టాలని సూచించింది. వెరసి, '2029లో విజయ్ ప్రధాని' అనే నినాదం తమిళనాడు అధికార కూటమిలో తీవ్ర చర్చకు దారితీయడమే కాకుండా, మిత్రపక్షాల మధ్య పొడచూపిన విభేదాలను బహిర్గతం చేస్తోంది.



# కేసీఆర్‌పై రేవంత్ సమరశంఖం!

(మొదటి పేజీ తరువాయి)

బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశామని తెలిపారు. నగర అభివృద్ధిలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగుతున్నామని చెప్పారు. తెలంగాణను మూడు భాగాలుగా అభివృద్ధి రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం తెలంగాణను మూడు భాగాలుగా విభజించి ప్రణాళికలు రూపొందిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలో నివసించే ప్రజల పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని, వరదల సమయంలో వారు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవనం, నగర మౌలిక వసతుల విస్తరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. చెరువుల ఆక్రమణలపై చర్యలు బతుకమ్మకుంటను గత పాలకులు ఆక్రమించారని సీఎం ఆరోపించారు. బతుకమ్మ నిమజ్జనానికి చెరువు లేకుండా కబ్జాకు గురైన ప్రాంతాన్ని హైడ్రా చర్యల ద్వారా తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. చెరువుల్లో ఆక్రమణలను తొలగిస్తున్నామని, ప్రజా ఆస్తులను పరిరక్షించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

**"వెయ్యి రోజుల్లో ఎంతో చేశాం"**

ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుందని రేవంత్‌రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూసి ఆశ్చర్యపోయామని అన్నారు. తెలంగాణను అప్పులకుప్పగా మార్చారని గత ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. గత పదేళ్లలో భారీగా అప్పులు చేశారని, వాటి అసలు, వడ్డీల చెల్లింపులకు ప్రతి నెలా వేల కోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని సీఎం తెలిపారు. పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుపైనా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. గతంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందేవి కావని, ప్రస్తుతం సమయానికి చెల్లిస్తున్నామని చెప్పారు. 72 వేలకుపైగా ఉద్యోగాల భర్తీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రేవంత్‌రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నియామకాలు జరగలేదని విమర్శిస్తూ.. తమ ప్రభుత్వం రెండేళ్లలో 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టిందని తెలిపారు. రైతు.. మహిళకు అండగా రైతుల సంక్షేమానికి రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు చెల్లించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మందికి సన్నబియ్యం అందిస్తున్నామని, పేదలకు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. రేషన్ కార్డుల విషయంలో గత ప్రభుత్వంపై ప్రశ్నలు సంధించారు. కేసీఆర్ రాజీనామాకు పిలుపు ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ప్రజా సమస్యలపై స్పందించడం లేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. వెయ్యి రోజుల పాలనలో కేసీఆర్ ఒక్కసారైనా ప్రజల మధ్యకు వచ్చారా? అని ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా ప్రభుత్వం నుంచి వేతనం పొందుతున్నారని ప్రస్తావిస్తూ.. లిలికేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, తమ ప్రభుత్వ పాలనపై అసెంబ్లీలో బహిరంగ చర్చకు సిద్ధమని సీఎం సవాల్ విసిరారు. "రేపటి నుంచి ఆరు రోజులపాటు ప్రధాన ప్రతిపక్ష నేత రాజీనామా చేయాలంటూ ఆందోళనలు చేయాలి" అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# పౌరసేవల్లో డేటా అనలటిక్స్.. పాలనలో కొత్త శకానికి చంద్రబాబు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారని, ఇదే స్ఫూర్తిని ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ కొనసాగించి, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు తాను 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో 20 సార్లు పాల్గొన్నానని గుర్తుచేశారు. ఇదే క్రమంలో సంక్షేమ హాస్టళ్లలో పారిశుద్ధ్య నిర్వహణను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. ప్రతి నెలా మొదటి ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులను హాస్టళ్లకు ఆహ్వానించి, అక్కడి పరిస్థితులు, భోజనం, తాగునీటి సౌకర్యాలపై వివరించాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయన్నారు. అదేవిధంగా అన్నా క్యాంటీన్ల ద్వారా అన్నార్తులకు సాయం అందించే దాతలను గుర్తించి ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలు తమ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే అందించాలని చంద్రబాబు ఆదేశించారు. రెవెన్యూ సహా అన్ని విభాగాలు ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీకృత సేవల విధానం ద్వారా ప్రజలకు వేగంగా నిర్ణయాలు అందేలా చూడాలని అన్నారు. పనితీరు ఆధారంగా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో బాధ్యులకు ర్యాంకులు ఇవ్వాలని, లోటుపాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని సరిదిద్దుకోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగంలో 'అవేర్' (AWARE) వేదిక ద్వారా రాష్ట్రంలోని సాగు పరిస్థితిని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి, రైతులకు అవసరమైన సూచనలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రకృతి సేద్యం చేసే రైతులను పూర్తిస్థాయిలో ప్రోత్సహించాలన్నారు. ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న 5.70 లక్షల ఎకరాల భూమిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని నిర్దేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా ఒప్పుకోకుంటే రాజీనామా చేస్తాం.. విజయ్ పార్టీకి కాంగ్రెస్ అల్టిమేటం

**2029 ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీని అంగీకరించాలని టీవీకేకి కాంగ్రెస్ హుకుం**

**లేదంటే తమిళనాడు కేబినెట్ నుంచి వైదొలుగుతామన్న కాంగ్రెస్ మంత్రులు**

**సీఎం విజయ్‌ను తదుపరి ప్రధానిగా టీవీకే నేతలు ప్రచారం చేయడమే వివాదానికి కారణం**

తమిళనాడులో అధికార సంకీర్ణ ప్రభుత్వంలో రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. 2029 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీని అంగీకరించకపోతే, తాము కేబినెట్ నుంచి వైదొలుగుతామని మిత్రపక్షమైన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని కాంగ్రెస్ మంత్రులు హెచ్చరించారు. ఈ పరిణామం ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కన్యాకుమారిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి ఎస్. రాజేశ్ కుమార్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. "2029లో రాహుల్ గాంధీయే కాంగ్రెస్ ప్రధాని అభ్యర్థి. ఆయనే తదుపరి ప్రధాని అవుతారు. ఒకవేళ ఈ ప్రతిపాదనను టీవీకే అంగీకరించడానికి నిరాకరిస్తే, కేబినెట్‌లో ఉన్న ఇద్దరు కాంగ్రెస్ మంత్రులం తక్షణమే రాజీనామా చేసి బయటకు వస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. పార్టీ లక్ష్యం ఇదేనని, కార్యకర్తలందరూ దీనికే ప్రాధాన్యత ఇస్తారని ఆయన అన్నారు.

వివాదానికి కారణమేమిటి?

ఇటీవల కాలంలో పలువురు టీవీకే నేతలు తమ అధినేత, సీఎం విజయ్‌ను జాతీయ స్థాయి నేతగా, భవిష్యత్ ప్రధానిగా అభివర్ణించడమే ఈ వివాదానికి ఆజ్యం పోసింది. మానవ వనరుల శాఖ మంత్రి డి. శరత్‌కుమార్ ఏకంగా అసెంబ్లీలోనే మాట్లాడుతూ "విజయ్ తదుపరి భారత ప్రధాని" అని వ్యాఖ్యానించారు. మరో మంత్రి, ఆధవ్ అర్జున మాట్లాడుతూ దేశానికి దక్షిణాది నుంచి ప్రధాని రావాల్సిన అవసరం ఉందని వాదించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే ఘనవిజయం తర్వాత విజయ్ నాయకత్వంపై జాతీయ స్థాయిలో ఆసక్తి పెరుగుతోందని మరికొందరు టీవీకే నేతలు పేర్కొంటున్నారు. ఈ ప్రచారమే కాంగ్రెస్ పార్టీకి తీవ్ర ఆగ్రహం తెప్పించింది.

కాంగ్రెస్ బలం.. వైఖరి

టీవీకే నేతల వ్యాఖ్యలపై కాంగ్రెస్ గట్టిగా స్పందించింది. 2029 ఎన్నికలకు రాహుల్ గాంధీ మాత్రమే తమ ఏకైక జాతీయ అభ్యర్థి అని ఉన్నత విద్యాశాఖ మంత్రి పి. విశ్వనాథన్ సహా పలువురు కాంగ్రెస్ నేతలు పునరుద్ఘాటించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో హంగ్ ఏర్పడినప్పుడు, ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ మద్దతుతోనే టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ఈ మద్దతు కారణంగానే దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత కాంగ్రెస్ పార్టీకి తమిళనాడు కేబినెట్‌లో చోటు దక్కింది. ఈ రాజకీయ బలాన్నే కాంగ్రెస్ ఇప్పుడు గుర్తు చేస్తోంది. 2024లో నటుడు విజయ్ ప్రారంభించిన టీవీకే పార్టీ, పోటీ చేసిన తొలి ఎన్నికల్లోనే అనూహ్య విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. అయితే, 2029 లోక్‌సభ ఎన్నికలకు ఇంకా మూడేళ్లకు పైగా సమయం ఉన్నప్పటికీ, ప్రధాని అభ్యర్థిపై ఇప్పటి నుంచే మొదలైన ఈ చర్చలు సంకీర్ణ ప్రభుత్వంలో స్పష్టమైన విభేదాలకు దారితీస్తున్నాయి. ఈ పరిణామాలు రానున్న రోజుల్లో తమిళనాడు రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు కారణమవుతాయోనని రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.





# బి ఎల్ ఓ ల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి





(ఆగష్టు -31- హంస కలంవార్త )

డిప్యూటీ కమిషనర్‌ను కోరిన మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోయిన్‌పల్లి సర్కిల్ ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్ డివిజన్లలో విధులు నిర్వహిస్తున్న బి ఎల్ ఓ లు ఎదుర్కొంటున్న సమస్యలను మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముందుగా బి ఎల్ వో లతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్న అనంతరం, వార్డు కార్యాలయంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్తో జరిగిన సమావేశంలో ముద్దం నర్సింహ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి ఎల్ ఓ లు గత కొంతకాలంగా ఎదురుచూస్తున్న పెండింగ్ జీతాలను వెంటనే క్లియర్ చేయాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. బి ఎల్ ఓ లు ప్రజలకు సేవలందించడంతో పాటు ఎన్నికలకు సంబంధించిన కీలక విధుల్లో నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి జీతాలు సకాలంలో అందకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వారి సమస్యలను సానుకూలంగా పరిగణించి గత బకాయి జీతాలను త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బి ఎల్ ఓ ల సమస్యలను పరిశీలించిన అధికారులు, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి







(ఆగష్టు -31- హంస కలంవార్త )

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి: కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ క్రీడలతో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. జింఖానా మైదానంలో హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 70వ అండర్-19 కళాశాలల క్రీడా పోటీలను ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, పట్టుదల పెరుగుతాయని తెలిపారు. అదే సమయంలో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు గొప్ప వేదికగా నిలుస్తాయని, ప్రతిభను నిరూపించుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ పిలుపునిచ్చారు. క్రీడాకారులకు పూర్తి సహకారం కంటోన్మెంట్ నియోజకవర్గ యువత, క్రీడాకారులకు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే శ్రీగణేష్ హామీ ఇచ్చారు. క్రీడా మైదానాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. గెలుపు ఒక్కటే విజయానికి కొలమానం కాదని, క్రీడాస్ఫూర్తితో పోటీలో పాల్గొని ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగడమే నిజమైన విజయమని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# లాఠీ దెబ్బలైనా.. పోరాటం ఆగదు!

తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం ఎంతటి పోరాటం చేశామో , స్వయం పాలనలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కూడా అంతే తీవ్రంగా పోరాడాల్సి వచ్చింది. కుమార్ యాదవ్ గత దశాబ్ద కాలానికి పైగా ప్రజా, విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై గళమెత్తిన వారిపై అనేక నిర్బంధాలు, లాఠీ ఛార్జ్ లు లాఠీ దెబ్బలు తిన్నాం.. అర్ధరాత్రి జైలు గోడలు చూశాం.. అయిన ప్రజా పక్షాన నిలబడటం మాత్రం ఆపలేదు! తెలంగాణ గడ్డపై గత 11 ఏళ్లుగా ప్రజా, విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై సాగిన ప్రతి పోరాటంలోనూ నిర్బంధమే పాలకుల సమాధానమైంది. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీలపై గళమెత్తితే దక్కింది లాఠీదెబ్బలే! నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ అడిగితే







అర్ధరాత్రి అక్రమ అరెస్టులే! రైతుల భూములు, ప్రజల సమస్యలు,కార్మికుల హక్కుల కోసం కొట్లాడితే పోలీస్ కేసులే! ప్రశ్నించే గొంతులపై పీడీ యాక్ట్‌లు, గృహ నిర్బంధాలు! అక్రమ అరెస్టులు. పోలీస్ లాఠీలకు నెత్తురోడినా.. అక్రమ కేసులతో భయపెట్టినా.. రాజ్యాంగం ఇచ్చిన హక్కుల కోసం, తెలంగాణ యువత భవిష్యత్తు కోసం పోరాటం ఆగదు!

## అర్హులైన వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లు మంజూరు చేయాలి

(ఆగష్టు -31-హంస కలంవార్త )



350 మంది లబ్ధిదారుల పింఛన్ దరఖాస్తులు అధికారులకు సమర్పించిన మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 262, 264 డివిజన్లలో పింఛన్‌కు అర్హత ఉన్న వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ కోరారు. ఈ మేరకు అర్హులైన లబ్ధిదారుల పింఛన్ దరఖాస్తులను ఆయన స్వయంగా డిప్యూటీ కమిషనర్‌కు సమర్పించారు. సుమారు 350 మంది పేద, అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాల కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో, తన సొంత ఖర్చులతో వారి పింఛన్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయించి, అవసరమైన ప్రక్రియను పూర్తి చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ 262, 264 డివిజన్లలో పింఛన్‌కు అన్ని విధాలా అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పింఛన్ అందని వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళల దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేసినట్లు తెలిపారు. అధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన ఆమోదం కల్పించి పింఛన్లు మంజూరు చేయాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరినట్లు చెప్పారు. పేద, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని ముద్దం నర్సింహ యాదవ్ తెలిపారు.

## బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, ఉమాశంకర్ కుమార్తె దశదిన కార్యక్రమానికి ఈటల రాజేందర్ హాజరు

(ఆగష్టు -31-హంస కలంవార్త )



చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు.. కుటుంబ సభ్యులకు పరామర్శ బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమాశంకర్ కుమార్తె దశదిన కార్యక్రమానికి మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఈటల రాజేందర్, వడ్డేపల్లి రాజేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆమె మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. విషాద సమయంలో కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, భగవంతుడు కుటుంబ సభ్యులకు ఈ కష్టకాలాన్ని ఎదుర్కొనే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

(ఆగష్టు -31-హంస కలంవార్త )





ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలి: జిల్లా రెవెన్యూ అధికారి మాలతి ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి మాలతి ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరిధిలో వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయం ( ఐడిఓసి) సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతితో పాటు జిల్లా న్యాయ అధికారి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారం కోసం పంపించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని అధికారులు నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులను ఆశ్రయిస్తున్నందున, వారి సమస్యలను నిబంధనల మేరకు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 86 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హంస కలం వార్త

# ఘనంగా బోనాల ఉత్సవాలు నిర్వహించుకుందాం





(ఆగష్టు -31-హంస కలంవార్త )

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాలు ప్రతీక: పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదుబండ విలేజ్‌లో సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి, తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డితో కలిసి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, తాజా మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, పాత్రికేయ మిత్రులు, మహిళా సోదరీమణులు, అభిమానులు, శ్రేయోభిలాషులకు బోనాల పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి కృప, ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు. బోనాల కోసం రూ. 20 కోట్ల నిధులు తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని మతాలను సమానంగా చూస్తూ, ఈ ఏడాది బోనాల ఉత్సవాల కోసం రూ. 20 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 92 దేవాలయాలకు రూ. 30.71 లక్షల నిధులు మంజూరయ్యాయని గాంధీ వెల్లడించారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సదుపాయాలతో పాటు అన్ని రకాల ఏర్పాట్లు సమన్వయంతో చేపట్టినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో భక్తులు బోనాల ఉత్సవాలను జరుపుకునేలా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు, కాలనీ వాసులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచానాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ మీద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మధ్యమధ్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.

# కూకట్‌పల్లిలో ఘనంగా ' షి డిజైనర్ స్టూడియో ' గ్రాండ్ ఓపెనింగ్







(ఆగష్టు -31-హంస కలంవార్త )

మహిళల అభిరుచులకు అనుగుణంగా అత్యాధునిక డిజైనర్ వేర్ మహిళల అభిరుచులు, అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక ఫ్యాషన్, డిజైనర్ వేర్ అందించేందుకు ఏర్పాటు చేసిన 'షీ డిజైనర్ స్టూడియో ' గ్రాండ్ ఓపెనింగ్ సోమవారం కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ ఐరిస్ బిల్డింగ్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా, ప్రత్యేక అతిథిగా బండి లకుమ దేవి హాజరై స్టూడియోను ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ మహిళల నూతన ఫ్యాషన్ అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన డిజైనర్ దుస్తులు, వస్త్రాలను అందించాలనే ఉద్దేశంతో షీ డిజైనర్ స్టూడియో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మహిళలకు ఆధునిక ఫ్యాషన్‌తో పాటు నాణ్యత, విభిన్న డిజైన్లను అందించేలా సంస్థ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. స్టూడియో నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెందాలని, వినియోగదారుల ఆదరణ పొందాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ బాబు, గాదే శివ చౌదరి, రామారావు, రమణ, సంధ్య, కల్పన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షీ డిజైనర్ స్టూడియో నిర్వాహకులను బండి రమేష్ దంపతులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# కాలనీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత








(ఆగష్టు -31-హంస కలంవార్త )

వన్ డే.. వన్ వార్డ్‌లో కమిషనర్‌తో పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ సమీక్ష కాలనీల్లో నెలకొన్న సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా తీసుకొని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అధికారులను కోరారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని ఆల్విన్ ఎంప్లాయిస్ కాలనీ పార్క్‌లో నిర్వహించిన వన్ డే.. వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా మసీదుబండ, శ్రీరామ్‌నగర్ వార్డుల పరిధిలోని కాలనీల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన, ఐఏఎస్, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మలెంపాటి, డీసీ సేవా ఇస్లావత్, వివిధ విభాగాల అధికారులు, కాలనీ ప్రతినిధులతో కలిసి గాంధీ సమస్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీరు తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, పనుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా సకాలంలో పూర్తి చేయాలని గాంధీ అధికారులను కోరారు. మౌలిక వసతుల కల్పనకు కృషి మసీదుబండ, శ్రీరామ్‌నగర్ వార్డుల పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులను మెరుగుపరుస్తామని గాంధీ తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, అసంపూర్తిగా ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని కమిషనర్‌ను కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అసంపూర్తిగా ఉన్న నాలాల విస్తరణ పనులను పూర్తి చేసి, వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను సకాలంలో మంజూరు చేసి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని కోరారు. పార్కుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి కాలనీల్లోని పార్కులను అన్ని హంగులతో అభివృద్ధి చేసి సుందరమైన ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తామని గాంధీ అన్నారు. పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు పిల్లలు, వృద్ధులు సేదతీరేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ప్రతి కాలనీలోని పార్కు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరారు. ఇంకుడు గుంతలతో వర్షపు నీటి సంరక్షణ ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని గాంధీ ప్రజలకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి కుటుంబం దీనిని సామాజిక బాధ్యతగా భావించి ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు. మసీదుబండ, శ్రీరామ్‌నగర్ వార్డులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని, శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి శాయశక్తులా పనిచేస్తానని గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంసి ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, జలమండలి విభాగాల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ టవర్స్.. పేదల ఆత్మగౌరవానికి ప్రతీక

(ఆగష్టు -31-హంస కలంవార్త )

అర్హతే ప్రామాణికంగా పారదర్శక లక్కీడ్రా.. శేరిలింగంపల్లికి 480 ఫ్లాట్లు ఎంపికైన కేశవనగర్‌కు చెందిన 9 మంది లబ్ధిదారుల కృతజ్ఞతలు హైదరాబాద్ మహానగరంలో నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తూ, పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ టవర్స్ నిలవనున్నాయని శేరిలింగంపల్లి నియోజకవర్గ పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కేటాయింపునకు సంబంధించి గచ్చిబౌలిలోని నిర్మిత కేంద్రంలో నిర్వహించిన లక్కీడ్రాలో కేశవనగర్‌కు చెందిన తొమ్మిది మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. ఎంపికైన లబ్ధిదారులు గాంధీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని గాంధీ అభినందించారు.



**సొంతింటి కల నెరవేరింది..**

లక్కీడ్రాలో ఎంపికైన లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఎంతో సంతోషంగా ఉందని, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ టవర్స్ ద్వారా పేదలకు సొంతింటిని అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 480 ఫ్లాట్లకు లక్కీడ్రా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గానికి ఇందిరమ్మ టవర్స్‌లో మొత్తం 480 ఫ్లాట్లను లాటరీ విధానం ద్వారా కేటాయిస్తున్నట్లు తెలిపారు. అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయాలకు అతీతంగా పారదర్శక విధానంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందన్నారు.

**480 ఫ్లాట్ల కేటాయింపులో నిర్దేశించిన రిజర్వేషన్ విధానం ప్రకారం:**

ఎస్సీ -- 14% : 67 ప్లాట్లు

ఎస్టీ -- 5% : 24 ప్లాట్లు

బీసీ -- 16% : 77 ప్లాట్లు

జనరల్ -- 50% : 240 ప్లాట్లు

ప్రభుత్వ/ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు -- 10% : 48 ప్లాట్లు

దివ్యాంగులు -- 5% : 24 ప్లాట్లు

లక్కీడ్రా అనంతరం అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి అర్హతలను నిర్ధారించిన తర్వాత తుది లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని గాంధీ తెలిపారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని, ఆ తర్వాత మూడు నుంచి నాలుగు రోజుల్లోనే టవర్స్ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.నిర్మాణ నాణ్యతపై లబ్ధిదారులకు హక్కు ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ సమయంలో ఎంపికైన లబ్ధిదారులు ఎప్పుడైనా నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనులను పరిశీలించవచ్చని గాంధీ తెలిపారు. నిర్మాణ నాణ్యతపై లబ్ధిదారులకు పూర్తి హక్కు ఉంటుందని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13న కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేయగా, కేవలం 15 రోజుల రికార్డు సమయంలోనే 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి టెండర్లు పిలవడం, మరోవైపు లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించడం పేదల ఇళ్ల విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 525 చదరపు అడుగుల్లో ఆధునిక వసతులతో ఇల్లు ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులకు అందించే ఇళ్లు ఆధునిక ప్రమాణాలతో, సౌకర్యవంతంగా నిర్మించనున్నట్లు గాంధీ తెలిపారు. ఒక్కో ఇంటిలో ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌తో కలిపి సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఈ ఇళ్లలో లబ్ధిదారుడి పేరుతో అన్‌డివైడెడ్ షేర్ కింద సుమారు 20 నుంచి 25 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. పేదల ఆత్మగౌరవానికి సొంతిల్లు హైదరాబాద్‌లో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్న నేపథ్యంలో నగరంలోనే పేదలకు సొంత ఇల్లు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని గాంధీ అన్నారు. ఎకరం వందల కోట్ల రూపాయలు విలువ చేసే ప్రాంతాల్లోనూ పేద కుటుంబాలు గౌరవంగా జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. "హైదరాబాద్ నగరం నడిబొడ్డున పేదవాడి ఇంటికి పునాది వేయడం అంటే కేవలం ఒక భవనం నిర్మించడం కాదు.. ఒక కుటుంబానికి భద్రత, ఒక తరానికి భరోసా, పేదవాడికి గౌరవంతో కూడిన జీవితం అందించడం" అని గాంధీ పేర్కొన్నారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం హైదరాబాద్ గృహ నిర్మాణ రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని, ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం మరో చారిత్రాత్మక అడుగు వేస్తోందని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు కృషి చేస్తామని గాంధీ తెలిపారు.

# వైభవంగా ఆదిశక్తి పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం





(ఆగష్టు -31-హంస కలంవార్త )

అమ్మవారి ఆశీస్సులు శేరిలింగంపల్లి ప్రజలందరిపై ఉండాలి: పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలో గల శ్రీ శ్రీ శ్రీ ఆదిశక్తి పోచమ్మ తల్లి, శ్రీ కనకదుర్గా అమ్మవారు, శ్రీ భవానీ శంకర నాగరాజ సహిత నవగ్రహ దేవాలయ షష్టమ దశ 16వ వార్షికోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై, ఆలయ ధర్మకర్త వేంకటకృష్ణ రత్నాకరరావు, తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అమ్మవారి కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలి ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఆలయ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులు శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని మనసారా కోరుకున్నట్లు తెలిపారు. పద్మపురాణం ప్రకారం జగన్మాత చండికా పరమేశ్వరి ఆరాధన ఎక్కడ జరుగుతుందో ఆ ప్రాంతం సస్యశ్యామలంగా, సుభిక్షంగా వర్ధిల్లుతుందని గాంధీ పేర్కొన్నారు. అమ్మవారి కరుణాకటాక్ష వీక్షణాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఆలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన అన్నారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత పెంపొందాలని గాంధీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బొందలపాటి లక్ష్మీరాజ్యం, వేంకటకృష్ణ రత్నాకరరావు, రమ్య, శ్రీనివాస చక్రవర్తి, సౌమ్య, వెంకట కిషన్, నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, లక్ష్మారెడ్డి, నాయినేని చంద్రకాంత్‌రావు, వెంకటేశ్వరరావు, దామోదర్‌రెడ్డి, కృష్ణ ముదిరాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.



# అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలి




(ఆగష్టు -31-హంస కలంవార్త )

సీపీఎం ఆధ్వర్యంలో పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా పటాన్‌చెరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కే. రాజయ్య డిమాండ్ చేశారు. రేషన్ షాపుల ద్వారా గతంలో ప్రకటించిన విధంగా 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు, రామచంద్రాపురం, బీరంగూడ, అమీన్‌పూర్ తదితర ప్రాంతాల్లో వేలాది మంది సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. నెలకు రూ.8 వేల నుంచి రూ.15 వేల వరకు అద్దెలు చెల్లిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొల్లూరు, అమీన్‌పూర్, బీరంగూడ, ముత్తంగి, నాగులపల్లి, కర్దనూర్, పోచారం, చిట్కుల్, కొడకంచి తదితర ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల నిర్మాణం చేపట్టినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో పనులు పూర్తికాకుండానే నిలిచిపోయాయని రాజయ్య అన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

పటాన్‌చెరు, రామచంద్రాపురం, బీరంగూడ ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం వేలాది మంది దరఖాస్తు చేసుకుని లబ్ధిదారుల జాబితాల్లో పేర్లు ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఇళ్ల కేటాయింపులు జరగకపోవడం దారుణమన్నారు. ఏళ్లుగా లబ్ధిదారులను అధికారులు కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని విమర్శించారు. అర్హులందరికీ ఇళ్లను కేటాయించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అదేవిధంగా సొంత స్థలాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు రావాల్సిన నిర్మాణ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ టవర్స్ పథకానికి సంబంధించి పటాన్‌చెరు నియోజకవర్గంలో విధివిధానాలను స్పష్టంగా ప్రకటించి, లక్కీ డ్రా ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని కోరారు. ప్రజల ఇళ్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని రాజయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి బి. నాగేశ్వరరావు, ఏరియా కమిటీ సభ్యులు ఎం.డి. వాజిద్ అలీ, పి. పాండురంగారెడ్డి, నాయకులు చంద్ర కిరణ్ సింగ్, లఖాన్, సదాశివరెడ్డి, సురేందర్, జయరాం, మార్క్స్ నగర్ అర్జున్, సంతోష్, ఇమ్మానియేల్ బాబు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



హంస కలం వార్త

## సెర్వైకల్ నొప్పితో బాధపడుతున్నారా?



ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. మెడలో బిగుసుకుపోవడం, భుజాలలో ఒత్తిడి, తలనొప్పి, వీపు నొప్పి వంటివి సెర్వైకల్ లక్షణాలుగా ఉండవచ్చు. సెర్వైకల్ నొప్పిని తగ్గించడానికి మీరు కొన్ని వ్యాయామాల సహాయం తీసుకోవచ్చు. ఈ వ్యాయామం మెడ బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కండరాలను సడలిస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి నిటారుగా కూర్చోండి లేదా నిలబడండి. ఆ తర్వాత మెడను నెమ్మదిగా ముందుకు వంచండి. ఆపై వెనుకకు వంచండి. ఈ ప్రక్రియను 5 నుండి 10 సార్లు చేయండి. దీని వల్ల సెర్వైకల్ నొప్పి తగ్గవచ్చు. ఇది మెడ సౌలభ్యాన్ని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి తలను నెమ్మదిగా కుడి వైపుకు తిప్పండి. కొన్ని సెకన్ల పాటు ఆపండి. ఆ తర్వాత తలను ఎడమ వైపుకు తిప్పండి. రెండు దిశలలో ఒక్కొక్కటి 5 సార్లు చేయండి. ఇది మెడ పక్కని కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. తలను నెమ్మదిగా కుడి వైపుకు వంచండి (చెవిని భుజం వైపు తీసుకురండి). 10 సెకన్ల పాటు ఆపండి. ఆపై ఎడమ వైపుకు పునరావృతం చేయండి. ఈ ప్రక్రియను 3-4 సార్లు చేయండి. ఈ భంగిమ మీ మెడ స్థానాన్ని మెరుగుపరుస్తుంది. సెర్వైకల్ నొప్పిని తగ్గిస్తుంది. దీన్ని చేయడానికి మీ వీపు, మెడను నిటారుగా ఉంచండి. ఆపై గడ్డాన్ని మెడ వైపు నెమ్మదిగా లోపలికి లాగండి. 5 సెకన్ల పాటు ఆపి, ఆ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వెళ్లండి. దీన్ని 10 సార్లు పునరావృతం చేయండి.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎగ్రా పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్‌గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.



## హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

(ఆగస్టు-31 హంస కలంవార్త)

ఇంటింటికీ 'కాంగ్రెస్ బాకీ కార్డు'తో ప్రజల్లోకి వెళ్తాం: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విమర్శించారు.సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు దాటుతున్నా హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు.ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 2 నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రజలకు లి'కాంగ్రెస్ బాకీ కార్డు'లిను అందజేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన జాప్యాన్ని ప్రజలకు వివరించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు.420 హామీలతో అధికారంలోకి వచ్చారు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద తులం బంగారం, రూ.4 వేల పింఛన్, దళితబంధు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు తదితర హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో ముందుకు సాగుతోందని మాధవరం కృష్ణారావు ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీసే సమయం ఆసన్నమైందని అన్నారు. ఇప్పటికే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై విసిగిపోయారని, మాజీ



ముఖ్యమంత్రి కేసీఆర్ తిరిగి రావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆదర్శంగా నిలిచింది గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి తెలంగాణను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దామని మాధవరం కృష్ణారావు అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తోందని విమర్శించారు.కనీసం ఎమ్మెల్యేలకు కూడా గౌరవం ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజా వ్యతిరేక నిర్ణయాలను విడనాడి ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని, రానున్న రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు.

## జీడిమెట్లలో భారీగా గంజాయి పట్టివేత





(ఆగస్టు-31 హంస కలంవార్త)

11.365 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్.. మరో నిందితుడి కోసం గాలింపు హైదరాబాద్ నగరంలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. మొత్తం 11.365 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి అక్రమ రవాణా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నిందితుల వద్ద నుంచి 11.365 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి నుంచి గంజాయి సరఫరాకు సంబంధించిన వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. గంజాయిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారు? ఎక్కడికి తరలించేందుకు ప్రయత్నించారు? ఈ వ్యవహారం వెనుక మరెవరెవరికి సంబంధం ఉంది? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.కాగా, ఈ కేసుతో సంబంధం ఉన్న మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతని ఆచూకీ కోసం ప్రత్యేక




బృందాలను రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడిని కూడా త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన అనంతరం గంజాయి సరఫరా నెట్‌వర్క్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజా నికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.



# మెస్సీ శకం ముగిసింది.. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన లెజెండ్

**అంతర్జాతీయ ఫుట్‌బాల్ కు వీడ్కోలు పలుకుతున్నట్టు ప్రకటించిన లియోనెల్ మెస్సీ**

**రెండు దశాబ్దాల తన అర్జెంటీనా కెరీర్‌కు భావోద్వేగంగా ముగింపు**

**2026 వరల్డ్ కప్ ఫైనల్ ఓటమి, తండ్రి మరణం తన నిర్ణయాన్ని మరింత బలపరిచాయన్న మెస్సీ**

**ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులకు, జట్టు సభ్యులకు కృతజ్ఞతలు**

**క్లబ్ ఫుట్‌బాల్‌లో ఇంటర్ మయామి తరపున ఆడటం కొనసాగిస్తానని స్పష్టీకరణ**

ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక శకం ముగిసింది. అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, కోట్లాది మంది అభిమానుల ఆరాధ్య దైవం లియోనెల్ మెస్సీ తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాల పాటు అర్జెంటీనా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆ లెజెండ్, ఇకపై దేశం తరఫున బరిలోకి దిగనని సోమవారం (ఆగస్టు 31) సంచలన ప్రకటన చేశాడు. ఈ మేరకు తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక భావోద్వేగ లేఖను పోస్ట్ చేశాడు. 2026 ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైనప్పటి నుంచే రిటైర్మెంట్ ఆలోచనలో ఉన్నానని, తన తండ్రి మరణం ఆ నిర్ణయాన్ని మరింత బలపరిచిందని మెస్సీ ఆ లేఖలో పేర్కొన్నాడు. మెస్సీ వీడ్కోలు వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

**భావోద్వేగ లేఖలో మెస్సీ ఏమన్నాడంటే?**

"ఫైనల్ ముగిసినప్పటి నుంచి సుదీర్ఘంగా ఆలోచించిన తర్వాత, నేను జాతీయ జట్టు నుంచి రిటైర్ అవుతున్నానని అందరికీ తెలియజేయాలనుకుంటున్నాను" అని మెస్సీ తన ప్రకటనను ప్రారంభించాడు. తన కెరీర్ ఆద్యంతం అర్జెంటీనా అభిమానులతో, జాతీయ జట్టుతో పెనవేసుకున్న అనుబంధం కారణంగా ఈ నిర్ణయం తీసుకోవడం చాలా బాధాకరంగా ఉందని తెలిపాడు. "ఈ నిర్ణయం నన్ను తీవ్రంగా గాయపరిచింది, ఇప్పటికీ బాధిస్తూనే ఉంది. కానీ, ఇదే సరైన సమయమని నేను అర్థం చేసుకున్నాను. నా దేశం కోసం నేను ఎప్పుడూ సర్వస్వం ఇచ్చానని ప్రమాణం చేస్తున్నాను. కేవలం గెలిచిన మ్యాచ్ లలోనే కాదు, అంతకుముందు కూడా ఈ జెర్సీ కోసం నేను ఎప్పుడూ పోరాడాను, నా సర్వశక్తులు ఒడ్డాను. ఫుట్‌బాల్ ద్వారా మీకు ఆనందాన్ని పంచడానికి, అర్జెంటీనా పౌరుడిగా మీరు గర్వపడేలా చేయడానికి ప్రయత్నించాను" అని భావోద్వేగంగా రాసుకొచ్చాడు.తన రిటైర్మెంట్ నిర్ణయం వెనుక ఉన్న బలమైన కారణాలను మెస్సీ స్పష్టంగా వివరించాడు. జూలైలో జరిగిన 2026 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్‌పై అర్జెంటీనా ఓటమి పాలవడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపాడు. ఆ ఓటమి తర్వాత రెండు రోజులకే, అంటే జూలై 21నే తాను ఈ వీడ్కోలు లేఖను రాసుకున్నట్లు వెల్లడించాడు. అయితే, ఇటీవల మా నాన్న మరణం తర్వాత, ఇక కొనసాగలేనన్న నమ్మకం బలపడింది" అని పేర్కొన్నాడు. మెస్సీకి తండ్రి జార్జ్ మెస్సీనే ఏజెంట్‌గా వ్యవహరించారు. సుదీర్ఘ అనారోగ్యంతో ఆగస్టు 8న మరణించిన విషయం తెలిసిందే. కాలం గడిచిపోవడం, కొత్త తరం



క్రీడాకారులు జట్టులోకి రావడం కూడా తన నిర్ణయానికి ఒక కారణమని మెస్సీ వివరించాడు. "నాకు మిగిలింది తక్కువ సమయమే. నా జీవితంలో కొన్ని అధ్యాయాలు ముగింపు దశకు వస్తున్నాయి. అందులో ఇది ఒకటి. ఇది నన్ను చాలా బాధిస్తోంది. నేను జాతీయ జట్టులో భాగమవ్వడాన్ని ప్రేమించాను, ప్రేమిస్తున్నాను, ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను. నా దగ్గర ఉన్నదంతా ఇచ్చేశాను. ఇక ఇవ్వడానికి ఏమీ మిగల్లేదు. అంతేకాకుండా, అద్భుతమైన యువ క్రీడాకారులు వస్తున్నారు. వారికి అవకాశం దక్కాలి" అని పేర్కొన్నాడు.రెండు దశాబ్దాల తన అంతర్జాతీయ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన అభిమానులకు మెస్సీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. "గడిచిన 20 ఏళ్లుగా మీరు చూపించిన ప్రేమకు, మద్దతుకు ధన్యవాదాలు. స్టేడియం లోపలి నుంచి మీ కేరింతలను నేను చాలా మిస్ అవుతాను. ఇకపై నేను కూడా మీలో ఒకడిగా, మంచి చెడు సమయాల్లో, ముఖ్యంగా కష్టకాలంలో బయటి నుంచి జట్టుకు మద్దతు ఇస్తాను" అని తెలిపాడు. తన ఈ సుదీర్ఘ ప్రయాణంలో తోడుగా నిలిచిన కుటుంబ సభ్యులకు, కోచ్‌లకు, సహచర ఆటగాళ్లకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపాడు. "ఈ అందమైన, అదే సమయంలో కఠినమైన ప్రయాణంలో నాతో పాటు ఉన్న నా కుటుంబానికి ధన్యవాదాలు. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతి కోచ్, సహచరుడు, అధికారికి నా కృతజ్ఞతలు. ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకాలను, క్షణాలను నాతో పాటు తీసుకువెళుతున్నాను" అని పేర్కొన్నాడు.జట్టు సభ్యులతో కలిసి దేశం కోసం సాధించిన విజయాలపై గర్వంగా, సంతృప్తిగా ఉన్నానని మెస్సీ తెలిపాడు. "నా సహచరులతో కలిసి, మనం కలలు మాత్రమే కనగలిగే క్షణాలను మీకు అందించామన్న గర్వంతో, మనశ్శాంతితో నేను వెళ్ళిపోతున్నాను. మీతో కలిసి ఆ అనుభూతిని పొందడం ఒక అద్భుతం. ఐ లవ్ యూ! నన్ను అర్జెంటీనా వాడిగా పుట్టించినందుకు దేవుడికి ధన్యవాదాలు. లెట్స్ గో, అర్జెంటీనా!" అంటూ తన లేఖను ముగించాడు. 2005లో అర్జెంటీనా సీనియర్ జట్టులోకి అరంగేట్రం చేసిన మెస్సీ, 207 మ్యాచ్‌లతో దేశం తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 125 గోల్స్ సాధించాడు. తన కెరీర్‌లో 2022లో ప్రపంచకప్ విజయం, రెండు కోపా అమెరికా టైటిళ్లు వంటి శిఖరాలను అధిరోహించడంతో పాటు, 2014, 2026 ప్రపంచకప్ ఫైనల్స్‌లో ఓటముల వంటి బాధాకరమైన క్షణాలను కూడా చవిచూశాడు. అతడి అంతర్జాతీయ కెరీర్ ముగిసినప్పటికీ, క్లబ్ ఫుట్‌బాల్‌లో మాత్రం కొనసాగనున్నారు. 2028 వరకు కాంట్రాక్ట్ ఉన్న ఇంటర్ మయామి జట్టు తరఫున ఆయన ఆడటం కొనసాగిస్తాడు. మెస్సీ వీడ్కోలుతో అర్జెంటీనా ఫుట్‌బాల్‌లో ఒక స్వర్ణయుగం ముగిసినట్లయింది.

# లార్డ్స్ ఓటమి ఎఫెక్ట్: పాక్ క్రికెట్‌లో భారీ ప్రక్షాళన.. ఏడుగురు ఆటగాళ్లపై వేటు!



ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో ఎదురైన ఘోర పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ప్రక్షాళన చర్యలకు ఉపక్రమించింది. లార్డ్స్‌లో జరిగిన రెండో టెస్టులో 194 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైన వెంటనే, సిరీస్ మధ్యలోనే జట్టులో సమూల మార్పులు చేపట్టింది. ఏడుగురు ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించడంతో పాటు, రెడ్-బాల్ కోచింగ్ సిబ్బందిపై కూడా వేటు వేసింది.వికెట్ కీపర్ మహమ్మద్ రిజ్వాన్, ఓపెనర్ ఇమామ్-ఉల్-హక్, పరిమిత ఓవర్ల క్రికెట్ మాజీ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘాతో పాటు అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, ముహమ్మద్ అవైస్ జాఫర్, ఖుర్రం షాజాద్‌లను జట్టు నుంచి విడుదల చేస్తున్నట్లు పీసీబీ ప్రకటించింది. వీరి స్థానంలో ఏడుగురు కొత్త ఆటగాళ్లను ఎంపిక చేసింది. వీరిలో సైమ్ అయూబ్, అబ్దుల్లా ఫజల్‌లకు టెస్ట్ అనుభవం ఉండగా, అరాఫత్ మిన్హాస్, మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బేగ్, మహమ్మద్ ఇమ్రాన్, రజావుల్లాలకు తొలిసారిగా టెస్ట్ జట్టులో చోటు లభించింది. ఆటగాళ్లపైనే కాకుండా కోచింగ్ సిబ్బందిలోనూ మార్పులు చేసింది. టెస్ట్ క్రికెట్ హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను బాధ్యతల నుంచి తప్పించింది. వారి స్థానంలో ఈ పర్యటన ముగిసే వరకు వైట్-బాల్ కోచ్ మైక్ హెసన్, యాష్లే నోఫ్కేలకు అదనపు బాధ్యతలు అప్పగించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో పాకిస్థాన్ ఇప్పటికే 0-2తో వెనుకబడగా.. ఆటగాళ్ల పేలవ ఫామ్, గాయాల వివాదాలే ఈ మార్పులకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇరు జట్ల మధ్య మూడో టెస్టు సెప్టెంబర్ 9న బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో ప్రారంభం కానుంది.

# సీఎస్కేలో ధోనీ వాటా.. వదంతులను ఖండించిన సీఈవో

**సీఎస్కేలో ధోనీ వాటా కోరుతున్నాడనే వార్తలు వదంతులేనన్న సీఈవో**

**ఫ్రాంచైజీలో 20 శాతం వాటా అడిగాడని వచ్చిన కథనాలను ఖండన**

**ధోనీ నిర్ణయం కోసం ఎదురుచూస్తామన్న ఫ్రాంచైజీ యాజమాన్యం**

చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఫ్రాంచైజీలో ఆ జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ వాటా కోరుతున్నట్లు వస్తున్న వార్తలను సీఎస్కే యాజమాన్యం ఖండించింది. ఈ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని, అవన్నీ కేవలం నిరాధారమైన వదంతులని సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు. దీంతో గత కొన్ని రోజులుగా సాగుతున్న ప్రచారానికి తెరపడింది.ఐపీఎల్ ప్రారంభం నుంచి సీఎస్కేతో ధోనీకి విడదీయరాని అనుబంధం ఉంది. అతడి సారథ్యంలో జట్టు ఏకంగా ఐదుసార్లు ఐపీఎల్ టైటిళ్లను కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో, ఫ్రాంచైజీతో తన బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే క్రమంలో ధోనీ సుమారు 20 శాతం వాటాను కొనుగోలు చేయాలని భావిస్తున్నాడని, కానీ సీఎస్కే యాజమాన్యం కేవలం 3 శాతం మాత్రమే ఆఫర్ చేసిందని కథనాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలతో ఇరువర్గాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని కూడా జోరుగా ప్రచారం జరిగింది. ఈ వదంతులపై కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ, "ధోనీ వాటా అడిగాడన్న వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదు. అవన్నీ కేవలం పుకార్లు మాత్రమే" అని కొట్టిపారేశారు. ఇక వచ్చే సీజన్‌లో ధోనీ ఆడతాడా లేదా అనే విషయంపై కూడా ఆయన వివరణ ఇచ్చారు. "వచ్చే సీజన్‌లో తాను ఆడనని ధోనీ మాతో ఎప్పుడూ చెప్పలేదు. ఏదైనా అతడిదే తుది నిర్ణయం" అని తెలిపారు. కాగా, 2025 మెగా వేలానికి ముందు సీఎస్కే ధోనీని రూ. 4 కోట్లకు రిటైన్ చేసుకుంది. అయితే, గాయం కారణంగా 2026 సీజన్‌లోని ఒక్క మ్యాచ్‌లో కూడా ధోనీ ఆడలేకపోయాడు.



# తిలక్ వర్మ అజేయ సెంచరీ.. పటిష్ఠ స్థితిలో సౌత్ జోన్

**దులీప్ ట్రోఫీ సెమీస్‌లో అజేయ శతకంతో మెరిసిన తిలక్ వర్మ**

**శ్రేయస్ గోపాల్ (88)తో కలిసి కీలక భాగస్వామ్యం నమోదు**

**నార్త్ జోన్‌పై 90 పరుగుల ఆధిక్యం సాధించిన సౌత్ జోన్**

**ఒక దశలో 80/5తో కష్టాల్లో పడిన సౌత్ జట్టును ఆదుకున్న తిలక్**

**రెండో రోజు ఆట ముగిసేసరికి 9 వికెట్లకు 285 పరుగులు చేసిన సౌత్ జోన్**

దులీప్ ట్రోఫీ సెమీ ఫైనల్‌లో నార్త్ జోన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతమైన సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. అతనికి శ్రేయస్ గోపాల్ (88) కీలక ఇన్నింగ్స్‌తో తోడవడంతో సౌత్ జోన్ పటిష్ఠ స్థితిలో నిలిచింది. బెంగళూరులోని బీసీసీఐ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో, రెండో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 285 పరుగులు చేసింది. దీంతో నార్త్ జోన్‌పై 90 పరుగుల కీలక ఆధిక్యాన్ని సంపాదించింది. నార్త్ జోన్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 195 పరుగులకే కట్టడి చేసిన అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన సౌత్ జోన్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు రికీ భుయ్ (5), షేక్ రషీద్ (0) విఫలమవడంతో పాటు, మిడిలార్డర్ కూడా చేతులెత్తేసింది. దీంతో సౌత్ జోన్ ఒక దశలో 80 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. గుర్నూర్ బ్రార్ తన పదునైన బౌలింగ్‌తో సౌత్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు.ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ తిలక్ వర్మ, శ్రేయస్ గోపాల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ నార్త్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ఆరో వికెట్‌కు 175 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలో శతకానికి చేరువైన శ్రేయస్ గోపాల్ 88 పరుగుల వద్ద అర్షదీప్ సింగ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత సౌత్ జోన్ మళ్లీ వికెట్లు కోల్పోయింది. అయితే, ఒక ఎండ్‌లో పాతుకుపోయిన తిలక్ వర్మ తన ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో 8వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆట ముగిసే సమయానికి 225 బంతుల్లో 106 పరుగులతో అజేయంగా నిలిచాడు.అంతకుముందు, సౌత్ బౌలర్లలో విద్వత్ కావేరప్ప 4 వికెట్లతో నార్త్ జోన్ పతనాన్ని శాసించగా, నిధీష్, తనయ్ త్యాగరాజన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. నార్త్ జోన్ బౌలర్లలో గుర్నూర్ బ్రార్ 4 వికెట్లు తీశాడు. ప్రస్తుతం క్రీజులో తిలక్ వర్మ, కావూరి సాయితేజ ఉన్నారు.



హంస కలం వార్త

# డీప్‌ఫేక్ వీడియో వైరల్.. తీవ్రంగా స్పందించిన 'అర్జున్ రెడ్డి' హీరోయిన్



'అర్జున్ రెడ్డి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన నటి షాలినీ పాండే, తనపై ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్న డీప్‌ఫేక్ వీడియోపై తీవ్రంగా స్పందించారు. ఇది పూర్తిగా కల్పితమని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన నకిలీ వీడియో అని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక పోస్ట్ చేశారు."ఆన్‌లైన్‌లో ప్రచారమవుతున్న ఆ వీడియో పూర్తిగా అవాస్తవం. అందులో ఉన్నది నేను కాదు" అని షాలినీ స్పష్టం చేశారు. సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ వ్యక్తులను, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకోవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించకూడదని, ఇది ఒక రకమైన వేధింపేనని ఆమె పేర్కొన్నరు.ఈ సందర్భంగా ఆమె ప్రజలకు ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు. ఆ నకిలీ వీడియోను ఎవరూ షేర్ చేయవద్దని, ఇతరులకు పంపవద్దని, అలాగే డౌన్‌లోడ్ చేయవద్దని కోరారు. దానికి బదులుగా, ఆ వీడియోను వెంటనే రిపోర్ట్ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, ఇలాంటి కల్పిత వీడియోల వ్యాప్తిని అరికట్టడంలో సహకరించాలని కోరారు. ఇటీవల కాలంలో డీప్‌ఫేక్ వీడియోల బారిన పడుతున్న ప్రముఖుల జాబితాలో షాలినీ పాండే కూడా చేరారు. గతంలో రష్మిక మందన్న, దీపికా పదుకొణె, కత్రినా కైఫ్, అలియా భట్, ఆమిర్ ఖాన్, రణ్‌వీర్ సింగ్ వంటి పలువురు సినీ తారలు ఇలాంటి నకిలీ వీడియోల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. షాలినీ పాండే 'అర్జున్ రెడ్డి'తో పాటు 'మహానటి', 'జయేష్‌భాయ్ జోర్దార్', 'మహారాజ్' వంటి చిత్రాలలో నటించి గుర్తింపు పొందారు.

# రవితేజ 'ఇరుముడి'పై దిల్ రాజు ప్రశంసలు.. ఆసక్తికర వ్యాఖ్యలు

**'ఇరుముడి' విజయం ఇండస్ట్రీ మొత్తానికి జోష్ ఇచ్చిందన్న దిల్ రాజు**

**ఒక మంచి సినిమా ఎలాంటి శక్తినిస్తుందో ఈ చిత్రం చూస్తే తెలుస్తుందన్న వ్యాఖ్య**

**10 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 180 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన రవితేజ సినిమా**

రవితేజ కథానాయకుడిగా నటించిన 'ఇరుముడి' చిత్రంపై ప్రముఖ నిర్మాత దిల్ రాజు ప్రశంసల వర్షం కురిపించారు. ఈ చిత్ర విజయం కేవలం చిత్ర బృందానికే కాకుండా, యావత్ టాలీవుడ్ పరిశ్రమకు నూతనోత్సాహాన్ని ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. సోమవారం జరిగిన 'కూర్మ అవతార్' చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ, "ఒక మంచి సినిమా ఎంతటి శక్తిని ఇస్తుందో 'ఇరుముడి' నిరూపించింది. ఈ చిత్రం సాధించిన విజయం పరిశ్రమలోని మా అందరికీ ఎంతో ఉత్సాహాన్ని కలిగించింది. ప్రేక్షకులు ఇదే రీతిలో పెద్ద సంఖ్యలో థియేటర్లకు తరలివస్తే, మాలాంటి నిర్మాతలకు ఎంతో ధైర్యంగా ఉంటుంది" అని వివరించారు. శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందిన 'ఇరుముడి' చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ సినిమా కేవలం 10 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 180 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి, రూ. 200 కోట్ల క్లబ్ దిశగా శరవేగంగా దూసుకుపోతోంది. బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్స్‌లో కలిపి ఇప్పటివరకు 7 మిలియన్లకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. ఒక్క ఉత్తర అమెరికాలోనే ఈ చిత్రం 1.25 లక్షల టికెట్ల విక్రయాలతో 1.5 మిలియన్ డాలర్ల వసూళ్లను సాధించింది. కాగా, ఇటీవల యశ్ నటించిన 'టాక్సిక్' సినిమాను దిల్ రాజు తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేశారు. ఆ సమయంలో, అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతున్న 'ఇరుముడి'ని కొన్ని థియేటర్ల నుంచి తొలగించి 'టాక్సిక్' చిత్రానికి కేటాయించడంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమయ్యాయి. అయితే, 'టాక్సిక్' ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, పలు థియేటర్లలో తిరిగి 'ఇరుముడి' చిత్రానికే ప్రాధాన్యతనిస్తూ ప్రదర్శిస్తున్నట్టు తెలుస్తోంది.





# 'రోమాంచకం'లో బబ్లీ గర్ల్ పాత్ర.. నా కల నెరవేరింది: అనంతిక సనిల్‌కుమార్

బ్లాక్‌బస్టర్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో, భద్రకాళి పిక్చర్స్ పతాకంపై సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'రోమాంచకం'. ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్న ఈ చిత్రంతో వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిసిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం చిత్ర హీరోయిన్ అనంతిక మీడియాతో ముచ్చటించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.ఈ సందర్భంగా అనంతిక మాట్లాడుతూ, "'8 వసంతాలు' తర్వాత చాలా కథలు విన్నాను. కానీ ఏదీ నన్ను అంతగా ఆకట్టుకోలేదు. ఆ సమయంలో 'రోమాంచకం' కథ వినగానే చాలా సంతోషం వేసింది. నేను చేయాలనుకున్న సినిమా ఇదే అనిపించింది. ఈ సినిమాలో బబ్లీగా, సరదాగా ఉండే అమ్మాయి పాత్ర నాది. ఇలాంటి పాత్ర చేయాలని ఎప్పటినుంచో కలలు కన్నాను" అని తెలిపారు. "ఈ చిత్రం యువతకు బాగా కనెక్ట్ అవుతుంది. ఇది కేవలం ప్రేమకథ మాత్రమే కాదు, ఇందులో హాస్యంతో పాటు ఉత్కంఠ కూడా ఉంటుంది. యూత్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా ఎంజాయ్ చేయవచ్చు. ఇందులో నేను తమిళ అమ్మాయిగా కనిపిస్తాను. హీరో సుమంత్ ప్రభాస్ పాత్ర చాలా ఎనర్జిటిక్‌గా ఉంటుంది. దానికి తగ్గట్టుగానే నా పాత్రను కూడా డిజైన్ చేశారు. మా ఇద్దరి మధ్య సంభాషణలు చాలా సహజంగా, వేగంగా సాగుతాయి" అని ఆమె వివరించారు. రోమాంచకం సినిమా చిత్రీకరణ అనుభవాల గురించి చెబుతూ, "షూటింగ్ సమయంలో ఎంత సరదాగా గడిపామో, సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు కూడా అంతే ఎంజాయ్ చేస్తారు. సందీప్ గారు నా నటనను మెచ్చుకోవడం సంతోషంగా ఉంది. నిర్మాత ప్రణయ్ రెడ్డి గారిని మొదట చూసినప్పుడు కోపం ఎక్కువ అనుకున్నాను, కానీ ఆయన చాలా సరదా మనిషి. సుమంత్ ప్రభాస్‌తో తొలిరోజే మంచి స్నేహం కుదిరింది" అంటూ షూటింగ్ అనుభవాలను పంచుకున్నారు.చిన్నప్పటి నుంచి తనకు కళలంటే ఇష్టమని, ఎల్‌కేజీ నుంచే డ్యాన్స్ నేర్చుకుంటున్నానని, ఆ అనుభవమే నటిగా తనకు ఎంతగానో ఉపయోగపడుతోందని అనంతిక పేర్కొన్నారు. మంచి అవకాశాలు వస్తే ఏ భాషలోనైనా నటిస్తానని ఆమె స్పష్టం చేశారు. చివరగా, "రోమాంచకం సినిమాలో ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే మూడు అంశాలు బలంగా ఉంటాయి. ముఖ్యంగా ప్రేమ నుంచే ఉత్కంఠ పుట్టడం ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమా నాకే కాకుండా హీరోకి కూడా మంచి గుర్తింపు తెస్తుందని నమ్ముతున్నాను. ప్రస్తుతం తెలుగు, తమిళ, మలయాళంలో కొన్ని ప్రాజెక్టుల చర్చలు జరుగుతున్నాయి" అని ఆమె ముగించారు.

# పుట్టబోయే బిడ్డకు 'సామ్రాజ్' పేరు.. సమంత ఫన్నీ రియాక్షన్!

మన గురించి మనమే ఎక్కువ ఆలోచిస్తున్నట్టు లేదూ అంటూ కామెంట్

ప్రముఖ నటి సమంత ప్రస్తుతం గర్భవతి అన్న విషయం తెలిసిందే. సినిమాలకు తాత్కాలిక విరామం ఇచ్చి మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్న ఆమె, సోషల్ మీడియా వేదికగా నిరంతరం అభిమానులతో సంభాషిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా అభిమానులతో జరిపిన చిట్‌చాట్‌లో ఆమె చేసిన ఒక సరదా వ్యాఖ్య ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.తమకు పుట్టబోయే బిడ్డ కోసం మంచి పేర్లను సూచించాల్సిందిగా సమంత తన అభిమానులను కోరారు. దీనిపై స్పందించిన ఒక అభిమాని, పాప పుడితే 'సమైరా' అని, బాబు పుడితే 'సామ్రాజ్' అని పేరు పెట్టాలని సూచించారు. సమంత, ఆమె భర్త, ప్రముఖ ఫిల్మ్‌మేకర్ రాజ్ నిడిమోరుల పేర్లు కలిసొచ్చేలా ఆ అభిమాని ఈ పేర్లను ప్రతిపాదించడం విశేషం.ఈ సూచనపై సమంత తనదైన శైలిలో చమత్కారంగా స్పందించారు. ముఖ్యంగా 'సామ్రాజ్' అనే పేరుపై బదులిస్తూ, "మన గురించి మనమే కాస్త ఎక్కువగా ఆలోచిస్తున్నట్లు అనిపించడం లేదా?" అంటూ నవ్వుతున్న ఎమోజీలతో రిప్లై ఇచ్చారు. తన పేరులోని 'సామ్', రాజ్ పేరులోని 'రాజ్' కలిపి పెట్టిన ఈ పేరు వినడానికి కాస్త ఆత్మస్తుతిలా ఉందన్న ఉద్దేశంతో ఆమె చేసిన ఈ వ్యాఖ్య నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. గత జూన్ నెలలో తన ప్రెగ్నెన్సీ విషయాన్ని ప్రకటించిన సమంత, అప్పటి నుండి గర్భధారణకు సంబంధించిన తన అనుభవాలను పంచుకుంటున్నారు. ఇప్పటికే తాను 11 కిలోల బరువు పెరిగానని ఆమె ఇటీవలే వెల్లడించారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ సరదా వ్యాఖ్య సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.



Edited, Printed,Published and Owned by **V. Madhusudan chary** , Lake view krishna residency.Flat no 102.Road no 4 Jaya nagarNear Ganesh Mandapam Kukatpally Telangana 500072, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No 9966555449